క్లుప్తంగా

డీఎస్పీగా రఘువీర్ బాధ్యతల స్వీకరణ



రామచంద్రపురం: రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా బి.రఘువీర్ సోమవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డివిజన్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు డీఎస్పీ రఘువీర్‌కు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

కపిలేశ్వరపురం: పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశు సంవర్ధక శాఖ అలమూరు ఏడీఏ ఎల్.అనిత సోమవారం తెలిపారు. మంగళవారం నల్లూరు, వాకతిప్ప, 22న వెదురుమూడి, అద్దంకివారిలంక, 23న పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, తాతపూడి, 25న అచ్యుతాపురం, కేదారిలంక, 27న వడ్లమూరు, మాచర, 28న వల్లూరు, టేకి, 29న నేలటూరు, 30న కాలేరు, కోరుమిల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు వివరించారు. ఆయా శిబిరాల్లో సేవలందించేందుకు పశు వైద్యాధికారులు, పశువైద్య సహాయకులు రెండు బృందాలుగా పర్యటించనున్నారు. మొదటి బృందంలో డాక్టర్ వీవీరమణమూర్తి, ఆర్.దుర్గాప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, బి.సురేంద్ర, గంజా రాజేష్, కె.రాంబాబు, కె.సూర్యకుమారి, కె.దొరబాబు, టీఎస్‌మల్లేశ్వరి పర్యటించనున్నారు. రెండో బృందంలో డాక్టర్ కేబీఎస్ఆర్ ప్రసన్న, డాక్టర్ కె.లక్ష్మీ మాధురి, పీవీఎస్ మూర్తి, పీవీ ప్రసాద్, వై.శివకుమార్, ఎం వీవీరమణ, బిల్లా నాని, పి.శ్యాంకుమార్, పిల్లి నానిబాబు సేవలందిస్తారని తెలిపారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న మండపేట ఏఎంసీ మాజీ చైర్మన్, వెదురుమూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సింహాచలాన్ని సోమవారం ఆ పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాజుబాబు పరామర్శించారు. సింహాచలం కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పిల్లి శ్రీను, మాజీ జెడ్పీటీసీ చిన్నం అపర్ణా పుల్లేష్, నాయకులు పాలమాల సత్తిబాబు, అధికారి శ్రీను, మొక్కా దాలియ్య, కత్తుల అప్పారావు, సాధనాల శివ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ సమీక్ష



సమీక్షలో మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చేనెల 8 నుంచి 14 వరకు జరిగే దివ్య కల్యాణ మహోత్సవాలను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ దేవదాయ అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. దేవస్థాన ఈవో అల్లు వెంకట దుర్గాభవాని అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారులు, ఆలయ సిబ్బంది, భక్తులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. నలుగురు దేవస్థాన సభ్యులతో వైదిక కమిటీ ఏర్పాటు చేసి దేవస్థానంలో జరిగే ప్రతి వైదిక కార్యక్రమంలో ముహూర్తాలు, విధి విధానాలను నిర్ణయిస్తారని మంత్రి సుభాష్ ఆదేశించారని, ఏఓ వెల్లడించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరపాలని మంత్రి సుభాష్ ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన అవసరం



అచ్యుతాపురంలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పీహెచ్‌సీల ఎంపీహెచ్ఈవోలు జిత్తుక మల్లికార్జునుడు, గోపాలకృష్ణ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా కపిలేశ్వరపురం, అచ్యుతాపురం గ్రామాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల ఎంపీహెచ్ఈవోలు జిత్తుక మల్లికార్జునుడు, గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకూ క్షేత్ర స్థాయిలో వ్యాధి లక్షణాలు కలిగినవారిని గుర్తించేందుకు సర్వే చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, రెడ్డి సుజాత, కార్యదర్శులు శివచక్రవర్తి, దేవీ ప్రసన్న, గ్రామాల నాయకులు రెడ్డి ప్రసాద్, పువ్వల చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చక్కటి కార్యాచరణతో సంసిద్ధం!

- సమీపిస్తున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలు
- సిద్ధమవుతున్న విద్యార్థులు
- ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు
- పరీక్షలు రాసే వారికి సీనియర్ విద్యార్థుల సూచనలు



అంగర కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఏడాది శ్రమ ఫలితం విజయంగా వరించాలన్నది విద్యార్థుల లక్ష్యం. ఆశయం ఎంత గొప్పదైనా దానికి తగిన ఆసక్తి, ప్రణాళిక, సమయం వెచ్చింపు, చదవడంలో నేర్పు ఎంతో అవసరం. పరీక్ష రాయడమంటే గుర్తున్నదంతా రాయడం కాదు. అడిగిన ప్రశ్నకు మార్కుల ఆధారంగా సమాధానాన్ని రాయాలి. అందుకోసం పరీక్ష రాసే విద్యార్థులకు సరైన సూచనలు, సలహాలు అవసరం. మార్చి 17 నుంచి 30 వరకూ పదో తరగతి, మార్చి 1 నుంచి 20 వరకూ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి గతంలో రాసిన పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల సలహాలు, సూచనల సమాహారమే ఈ కథనం..

గతేడాది వేగంగా పరీక్షల నిర్వహణ ప్రక్రియ

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతేడాది విద్యా సంవత్సరం విజయపథాన నడిచింది. ప్రణాళికా బద్ధంగా వ్యవహరించడంతో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాలు విడుదల అంతా సజావుగా త్వరితగతిన సాగింది. గతేడాది పదో తరగతి పరీక్షలను మార్చి 18 నుంచి 30 వరకూ నిర్వహించి ఏప్రిల్ 8న వాల్యూయేషన్ పూర్తి చేసి ఏప్రిల్ 22న ఫలితాలను విడుదల చేశారు. గతేడాది ఇంటర్ పరీక్షలను మార్చి 1 నుంచి 20 వరకూ నిర్వహించి ఏప్రిల్ 4తో మూల్యాంకనం పూర్తి చేసి ఏప్రిల్ 12న ఫలితాలను విడుదల చేశారు.

గతంలో పదోతరగతి ఫలితాలు ఇలా...

2023–24 విద్యా సంవత్సరంలో మండపేట మండలంలో 1008 పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులై 81 శాతం ఫలితాన్ని సాధించారు. రాయవరం మండలంలో 700 మందికి 614 మంది పాసై 87 శాతం, కపిలేశ్వరపురం మండలంలో 387 మందికి 375 మంది పాసై 97 శాతం ఫలితాలు నమోదయ్యాయి. రామచంద్రపురం పట్టణంలో 391 మందికి 314 మంది పాసై 81 శాతం, రామచంద్రపురం రూరల్ మండలంలో 533 మందికి 450 మంది పాసై 85 శాతం, కె.గంగవరం మండలంలో 450 మందికి 418 మంది పాసై 93 శాతం, కాజులూరు మండలంలో 95 శాతం ఫలితాలను సాధించారు.

ఇంటర్ ఫలితాలు

2023–24 ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 121 మంది పరీక్షలు రాయగా 51 మంది పాసై 42 శాతం ఉత్తీర్ణ నమోదైంది. రాయవరం ప్రభుత్వ కళాశాలలో 43 మందికి 17 మంది పాసై 40 శాతం, పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 47కి ఏడుగు పాసై 14శాతం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు జూనియర్ కళాశాలలో 104 మందికి 76 మంది పాసై 73 శాతం ఫలితాలను సాధించారు. ఒకేషన్ కోర్సుల్లో 85 మందికి 73 మంది పాసై 85 శాతం ఫలితాలను సాధించారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి



వల్లూరుకు చెందిన నేను సీబీఎస్‌సీ సిలబస్‌లో పదో తరగతి చదవగా 75 శాతం మార్కులు సాధించాను. ఇంటర్ కూడా సీబీఎస్‌సీ సిలబస్ చదవగా 92 శాతం మార్కులు వచ్చాయి. ప్రస్తుతం మారిషస్‌లో ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. లక్ష్యం పెద్దదిగా నిర్దేశించుకుంటే మెరిట్ సాధనకు అవకాశం ఉంటుంది.

– పొట్నూరి కల్యాణ సమజ్ఞ, ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్, అన్నా మెడికల్ యూనివర్సిటీ, మారిషస్

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు దగ్గరపడే కొద్దీ సమయం సమస్య తలెత్తుతుంది. రోజువారీ సమయాన్ని ఎవరికి వారు ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకోవాలి. అలా చేయడం వల్ల పదో తరగతిలో 600కి 552 మార్కులతో పామర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచాను. ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470కి 464 సాధించి కళాశాల ఫస్ట్ సాధించాను.

– పెద్దిరెడ్డి బాలాశ్రీ, సెకండ్ ఎంపీసీ, పామర్రు, కె.గంగవరం మండలం

పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి



పాఠ్యాంశాలపై పట్టు సాధించడం ద్వారా పరీక్ష రాసే తీరుపై అవగాహన పెరుగుతుంది. ఏడాది పాటు విజ్ఞాన సముపార్జన కోసం చదివిన మనం ఈ నెల రోజుల్లో పరీక్ష పేపర్‌కు అనుకూలంగా చదవాల్సి ఉంటుంది. అలా చేయడం వల్ల పదో తరగతిలో 600కి 525, ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీలో 500కి 478 మార్కులతో కాలేజ్ ఫస్ట్‌గా నిలిచాను.

– సత్యవతి, దుళ్ల

పరీక్ష పేపర్‌పై అవగాహన పెంచుకోవాలి



ఎంత చదివితే అంత విజ్ఞానం వస్తుందన్నది వాస్తవం. అలాగని పరీక్ష పేపర్‌లో చదవినవన్నీ రావన్నది కూడా అంతే వాస్తవం. రాయబోయే పరీక్షకు పేపర్ ఎలా ఇస్తారో అన్నదానిపై పట్టు సాధించాలి. పదో తరగతిలో 600కి 517, ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470కి 464 మార్కులు సాధించగలిగాను.

– బొడ్డు దివ్య, సెకండ్ సీఈసీ, వల్లూరు, కపిలేశ్వరపురం మండలం

అధ్యాపకుల సూచనలు పాటించాలి



అధ్యాపకుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. వాటికి ప్రాధాన్యతనిస్తూ చదువుకోవాలి. పదో తరగతిలో 600 కి 567 మార్కులతో స్కూల్ ఫస్ట్, ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470 కి 463 మార్కులతో కళాశాల ద్వితీయ స్థానాన్ని సాధించాను.

– చిట్టూరి సంధ్య, సెకండ్ ఎంపీసీ, కపిలేశ్వరపురం

సమయ పాలన పాటించాలి



పరీక్ష రాసేటప్పుడు మూడు గంటల పరీక్షా సమయాన్ని ప్రణాళికాబద్ధంగా విభజించుకోవాలి. తెలిసినదంతా పేపర్‌పై రాయాలనుకోరాదు. కేటాయించిన మార్కుల ఆధారంగా సమాధానం రాయడం ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతాం. ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470కి 464 మార్కులతో కళాశాల ఫస్ట్‌గా నిలిచాను.

– ఎం.అలేఖ్య, సెకండ్ ఎంపీసీ, మండపేట

సైన్స్ సబ్జెక్టు ప్రాధాన్యతను గుర్తించాలి



సైన్స్ సబ్జెక్టులు చదవేవారు ఆయా సబ్జెక్టుల ప్రాధాన్యతను గుర్తించాలి. పరీక్ష రాసేటప్పుడు అవసరమైన మేరకు పటం వేస్తూ వివరణ రాయాలి. పదో తరగతిలో 600కి 495 మార్కులతో స్కూల్ ఫస్ట్, ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440కి 434 మార్కులతో కాలేజ్ ఫస్ట్‌లోనూ నిలిచాను.

– ఇంటి మహాలక్ష్మి, పెదపళ్ల

పారిశుధ్య కార్మికులకు చెత్త అప్పగించాలి



గాంధీనగర్‌లో దుకాణ దారుడికి జరిమానా వేస్తున్న కమిషనర్

మండపేట: పట్టణంలోని 30 వార్డుల ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను పారిశుధ్య కార్మికులకు అప్పగించి పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. ఇదే నిబంధనను మెయిన్‌రోడ్డు, కేపీ రోడ్డులో వ్యాపారాలు సాగిస్తున్న దుకాణ దారులు సైతం పాటించాలన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. శానిటేషన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. గాంధీ నగర్, రైతుబజార్, పార్థసారథి నగర్‌లో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. డ్రైన్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఓ కిరాణా దుకాణం వద్ద డ్రైన్‌లో చెత్త వేయడాన్ని చూసి దుకాణ దారుడికి రూ.300 అపరాధ రుసుము విధించారు. అక్కడ పాత పెంకిటిల్లు యజమాని ఇళ్లు పీకిన వ్యర్థాలతో డ్రైన్‌ను పూర్తిగా మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థల యజమానికి రూ.700 జరిమానా విధించారు. ఇకపై చెత్త విషయంలో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

శ్రీరామారెడ్డి కుటుంబీకులకు వేణు పరామర్శ



శ్రీరామారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

కాజులూరు: తీర్థయాత్రలకు వెళ్లి అరుణాచలంలో గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి కుటుంబీకులను సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ తదితర నాయకులు పరామర్శించారు. శ్రీరామారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భార్య సత్తి గంగాదేవిని అరుణాచలంలో జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబద్ధత కలిగిన కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి, వైద్యుడిగా గొల్లపాలెం పరిసర గ్రామాల ప్రజలకు డాక్టర్ శ్రీరామారెడ్డి చేసిన సేవలను మాజీ మంత్రి వేణు కొనియాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెలగా సత్తిరెడ్డి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, కాజులూరు మాజీ ఎంపీటీసీ యాళ్ల ధనరాజు తదితరులు శ్రీరామారెడ్డి కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పంటబోదెలోకి దూసుకెళ్లిన బైక్: వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: వెలంపాలెం గ్రామానికి చెందిన వెల్డర్ కోనపల్లి జ్యోతిబాబు (38) ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పి పంట బోదెలోకి దూసుకుపోవడంతో మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం... వేగాయమ్మపేట వద్ద సోమవారం ఉదయం ప్రమాదం జరిగింది. వాహనంతో పంటబోదెలో పడిపోయిన జ్యోతిబాబును బంధువులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన దంగేటి ఏసుబాబు (54)కు పెళ్లి కాలేదు. అతడికి మతిస్థిమితం లేదు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మరలా తిరిగిలేదు. దీనిపై అతని బంధువు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

వినియోగదారుల సేవాకేంద్రంలో చోరీ

ఆలమూరు: గ్రామశివారు కొత్తూరు సెంటర్‌లో చోరీ జరిగింది. స్థానిక పెదపళ్ల రోడ్డులోని చైతన్య సప్లయర్స్‌లో బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందిన అనుబంధ వినియోగదారుల సేవా కేంద్రం ఉంది. అందులో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కొంత నగదుతో పాటు ఖాతాదారుల సమాచారంతో నిండి ఉన్న డెస్క్‌ను దొంగిలించారు. దీంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



లారీ డ్రైవర్లు, ఓనర్లకు నిబంధనలు వివరిస్తున్న సీఐ దొరరాజు

మండపేట: లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని రూరల్ సీఐ పి.దొరరాజు హెచ్చరించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారపూడి లారీ యూనియన్ ఓనర్స్ అండ్ డ్రైవర్లతో ఆయన సోమవారం ట్రాఫిక్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత నియమ నిబంధనలను వివరించారు. లారీలు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వాహన ప్రయాణ సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపై వాహనాలు ఇష్టానుసారం నిలుపరాదన్నారు. వాహనం నిలుపుదల చేసే సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం రాకుండా వాహనాన్ని పార్క్ చేయాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా డ్రైవర్లు నడుచుకోవాలని సూచించారు. అనంతరం లారీడ్రైవర్‌లు పార్కింగ్ ప్లేసులు వద్ద పడే ఇబ్బందులు, సమస్యలపై విన్నవించారు. రోడ్డుకు ఒకవైపు మాత్రమే లారీలు పార్కింగ్ చేసుకోవాలని సీఐ చెప్పారు. లారీ డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ పి.బుజ్జిబాబు, లారీ డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

వరి పంటపై జింకుధాతు లోపం



పెదలంకలో జింకుధాతు లోపం తలెత్తిన వరిపంట

కాజులూరు: మండల గ్రామాల్లోని పలుచోట్ల వరి పంటపై ప్రస్తుతం జింకుధాతు లోపం తలెత్తడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 24,500 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది రబీలో 19,200 ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మండలంలో ప్రస్తుతం దాదాపు వరి నాట్లు పూర్తి కాగా ముందుగా వెదజల్లిన, నాట్లు వేసిన పొలాల్లో పంట దుబ్బు గట్టిపడే దశ నుంచి పిలకలు తొడిగే దశలో ఉన్నాయి. అయితే ముందుగా నాట్లు వేసిన పొలాల్లో అక్కడక్కడా కాండం తొలుచుపురుగు, లద్దె పురుగు ఆశించిందని అధిక శాతం పొలాల్లో జింకుధాతు లోపాలు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. జింకుధాతు లోపం ఏర్పడితే వరి ఆకుసుతలపై తుప్పు రంగు మచ్చలు ఏర్పడుతున్నాయని అవి క్రమేపీ కలసిపోయి ఆకు అంతా గోధుమ రంగులోకి మారిపోతుందని రైతులు అంటున్నారు. దీనిపై ఏవో వి.అశోక్‌ను వివరణ అడగ్గా వరి మొక్కకు జింక్ అనేది తక్కువ పాళ్లలోనే అవసరం అవుతుందని అయినప్పటికీ అది తగ్గితే జింకుధాతు లోపం తలెత్తి పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. వాతావరణంలో చలి ఎక్కువగా ఉన్నప్పుడు వరి పంటపై జింకులోపం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. దీంతో పంట ఏ విధమైన పోషకాలను గ్రహించలేదని, మొక్క క్రమేపీ ఎదుగుదల లేక గిడసబారి పోతుందన్నారు. ఈ ఆకును విరిచినప్పుడు లోహపు శబ్దం వినిపిస్తుందన్నారు. జింకుధాతు లోపం నివారణకు జింక్‌సల్ఫేట్ నాలుగు వందల గ్రాముల మందును రెండు వందల లీటర్ల నీటిలో కలిపి మూడు రోజుల వ్యవధిలో ఎకరం పంటపై రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు పక్క రైతులను అనుసరిస్తూ అవసరం లేకుండానే ఇష్టమొచ్చిన ఎరువులు, మందులు పంటలపై వినియోగిస్తున్నారని దీనివల్ల అనవసరపు ఖర్చులు అవటమే కాకుండా పంటకు నష్టం జరుగుతుందన్నారు. పంటపై సోకే తెగుళ్లను రైతులు ఎప్పటికప్పుడు గ్రహిస్తూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

జాతర వేళ.. విద్యుత్‌కాంతుల హేల



ఆకట్టుకుంటున్న స్వాగత ద్వారాలు



అబ్బుర పరుస్తున్న కదిలే చిత్రాలు

రాయవరం: గ్రామదేవత పోలమ్మ జాతరను పురస్కరించుకుని గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల సోయగాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రికి పూర్తిస్థాయిలో ఎల్ఈడీ బల్బులతో విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. కళ్లు మిరుమిట్లు గొలిపేవిధంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వెలంపేట రామాలయం, పోలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు, కదిలే జిరాఫీ, భయపెట్టే భూతం బొమ్మలు అలరిస్తున్నాయి. కాగా బిక్కవోలు మండలం కొంకుదురుకు చెందిన బాబూరావు, కలకత్తాకు చెందిన పరమేశ్వర్ పోటాపోటీగా లైట్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

‘ఆత్మ’ కార్యక్రమాలు విస్తృతం చేయాలి



ఆత్రేయపురంలో అయ్యగారి వెంకట్రామయ్యను సత్కరిస్తున్న ఆత్మ సభ్యులు

కొత్తపేట: ఆత్మ సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. చాప్టర్ ఆఫీస్‌లో ఆదివారం రాత్రి రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వేగేశ్న తమ్మిరాజు అధ్యక్షతన ఆత్మా ఆత్మీయ కలయిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కోరారు. సంఘ ఆర్థిక అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు రూ.లక్ష చొప్పున విరాళాలు ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన పలువురు గురువులు, సభ్యుల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు అయ్యగారి వెంకట్రామయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ కాశీచైనుల వీరభద్రరావు, కామేశ్వరి తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మ జాయింట్ సెక్రటరీ సీహెచ్ చినవెంకటరాజు, కోశాధికారి వేగేశ్న సురేఖ, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల ధర్నా



ప్రమాద స్థలం వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

రాయవరం: మండలంలోని వెదురుపాక సావరం గ్రామానికి చెందిన వెలుపూడి రమణ (50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన వారి నుంచి మృతుడికి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు సోమవారం రాత్రి ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. వెలుపూడి రమణ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు కుమారులు, కుమార్తెకు వివాహాలు చేశాడు. భార్య రమణమ్మ కూలి పని చేస్తుంది. ఆదివారం రాత్రి రాయవరం పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ పోయించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో రాయవరం గ్రామ శివార్లలోని రామిరెడ్డి రైసుమిల్లు వద్ద బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు ద్విచక్రవాహనంతో బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన రమణను రాయవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుని వెళ్తున్న క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకుని వస్తుండగా, ప్రమాదం జరిగిన స్థలం వద్ద బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు, మండపేట రూరల్ ఎస్సై పి.బుజ్జిబాబులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు.